

ఇలపర్రు హైస్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

మండలంలోని ఇల్లపర్రు ప్రాథమిక ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా ఆరోగ్య టాస్క్ ఫోర్స్ టీం సందర్శించింది. పాఠశాలలో చదువుతున్న కిశోర బాలికలకు హెచ్‌బి పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. బాలికలు ప్రతి గురువారమూ ఐఎఫ్ఎ మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లా గుణాంకాధికారి ఎంవి.ప్రసాద్, డిపిహెచ్ఎన్ఒ.వెంకటరత్నం, జిల్లా ప్రోగ్రాం అధికారి జి.సుభాష్, ఎల్‌డి కంప్యూటర్ పివి.భాస్కరరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ..

నేడు సమ్మె

దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణకు పని బంద్

కార్మిక చట్టాల నిర్వీర్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగనున్న నిరసనలు, ర్యాలీలు, సభలు

సమ్మెలోకి 55 వేల మందిపైగా కార్మికులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్మికుల హక్కులను హరించేందుకు మోడీ సర్కార్ అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం రెండు జిల్లాల్లోని కార్మికులంతా సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి తదితర కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెకు అన్ని తరగతుల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది. బుధవారం ఉదయం నుంచి జిల్లాలోని కార్మికులంతా పని బంద్ చేసి సమ్మెలో పాల్గొనున్నారు. జిల్లా కేంద్రాలు ఏలూరు, భీమవరంతోపాటు పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం ఉధృతంగా సమ్మె నిర్వహించేందుకు కార్మికులంతా ఇప్పటికే పిలుపునిచ్చారు. కొన్ని రోజులుగా సమ్మె సన్నాహాలు అన్ని ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున సాగాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు ఇలా 55 వేల మందికిపైగా కార్మికులు సమ్మెలోకి దిగనున్నారు. సమ్మె నేపథ్యంలో ర్యాలీలు, నిరసనలు, సభలతో జిల్లా అంతా హోరెత్తనుంది. జిల్లా కేంద్రం ఏలూరులో పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి కార్మికులంతా భారీ ర్యాలీ నిర్వహించి ఆర్‌ఆర్‌పేట పార్క్ వద్ద సభ నిర్వహించనున్నారు. జిల్లా నాయకులతోపాటు రాష్ట్ర నాయకులు సైతం పాల్గొనున్నారు. తమ సత్తా ఏమిటో కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి తెలియజేసేందుకు కార్మికులంతా ఏకమై సమ్మెలోకి వెళ్లనున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి వాటిస్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్పొరేట్లకు మేలు చేయాలని మోడీ సర్కార్ కొంతకాలంగా ఉవ్విళ్లూరుతోంది. 2020లోనే ఈ కోడ్‌లు తీసుకొచ్చినప్పటికీ కార్మికుల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందనే భయంతో అమలు మాత్రం చేయలేదు. ఈ ఏడాది లేబర్‌కోడ్‌లను అమల్లోకి తేవాలని మోడీ సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని కార్మికులంతా సమ్మె సైరన్ మోగించారు.

నిరకుంశ కార్మిక కోడ్‌లపై తిరుగుబాటు

మోడీ సర్కార్ తెచ్చిన లేబర్ కోడ్‌లతో దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న కార్మికుల హక్కులు హరించుకుపోనున్నాయి. కార్మికులు సాధించిన 29 చట్టాలను రద్దు చేసి మోడీ సర్కార్ వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ ఇలా మొత్తం నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవాలని చూస్తోంది. దీంతో కనీస వేతనం అమలుకు నోచుకోని పరిస్థితి రానుంది. ఇప్పటికే ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ పది గంటలకు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసి ముందుకు సాగుతున్నాయి. కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలు రద్దయితే కార్మిక లోకంపై కార్పొరేట్లకు పూర్తి ఆధిపత్యం ఏర్పడనుంది. లేబర్ కోడ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేయడానికి వీల్లేదంటూ కార్మిక లోకమంతా పని బంద్ చేసి సమ్మెలోకి దిగనుంది. మోడీ సర్కార్ మెడలు వంచేందుకు కార్మికులు తమ శక్తి ఏమిటో సమ్మెతో మరోసారి చాటనున్నారు.

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - తణుకు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరిగే జాతీయ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపు నిచ్చారు. మంగళవారం సిఐఐయు ఆధ్వర్యంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పివి.ప్రతాప్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మనుగడ సాగించాలంటే లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక సంఘాల డిమాండ్స్ అమలు చేయాలని, లేదంటే జరిగే పరిణామాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం ఉదయం 9 గంటలకు చిట్టూరి ఇంద్రయ్య కాలేజీ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ మహా ర్యాలీ జరుగుతుందని తెలిపారు. సిఐటియు మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి, గార రంగారావు, అందే శ్రీనివాస్, ప్రసాద్, కృష్ణబాబు, ఎన్.చిన్నారావు, కృష్ణారావు, శివ, రమేష్, పి.జ్యోతిబాబు, అయ్యప్ప, బాలాజీ పాల్గొన్నారు.

వీరవాసరం:లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఈ నెల 9న చేపట్టనున్న జాతీయ సమ్మె జయప్రదం కావాలని వీరవాసరంలో స్కీమ్ ఉద్యోగులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు మండల కార్యదర్శి పి.నాగరత్నం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొంటున్నారని, అన్ని సంస్థలకూ, సంఘాలకూ సమ్మె నోటీసులు అందజేశామని తెలిపారు. ఈ సమ్మె ప్రారంభం మాత్రమేనని తెలిపారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు బొర్రా అలమహారాజు, సిఐటియు మండల అధ్యక్షురాలు వరలక్ష్మి, విజయ, నాగ పార్వతి, శిరీష నాయకత్వం వహించారు. ఎం ఆంజనేయులు సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఆచంట: ఈనెల 9న జరగనున్న సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు కేత నాగ ఆంజనేయులు అధ్యక్షతన స్థానిక సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు సానబోయిన సత్యనారాయణ (సత్తిపండు), తానేలంక లక్ష్మీనారాయణ, ఇళ్ల సత్యనారాయణ, కొమ్మన గోపాలకృష్ణ, పాల్గొన్నారు.



వీరవాసరంలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు నేతలు

ఆకివీడు : ఈనెల 9న చేయనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు స్థానిక అర్బన్ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రాజశేఖర్‌కు, సిబ్బందికి నోటీసులు అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను పూర్తిస్థాయి ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశాలు వైకుంఠపు రామలక్ష్మి, ఇంటి మార్తమ్మ, పి.నాగమణి, చండూరు అశ్విని, కరణం చిన్నమ్మ పాల్గొన్నారు.

పెనుగొండ : ఈ నెల 9వ తేదీన జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిద్ధాంతం పిహెచ్‌సి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కంకిపాటి లక్ష్మికుమారి పిలుపు ఇచ్చారు. సిద్ధాంతం పిహెచ్‌సిలో పిహెచ్ఎన్ కె.వెంకటలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నందుకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఉదయం 9 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్దకు కార్మిక సంఘాలు రావాలని అక్కడి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీగా వెళ్తుందని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెకు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - భీమవరం

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వందేళ్లకు పైగా చేసిన నిరంతర ఉద్యమాల ద్వారా ఎనిమిది గంటల పని, పెన్షన్, పిఎఫ్, గ్రాడ్యుటీ, బోనస్, కనీస వేతనాలు వంటి అనేక సౌకర్యాలు, యూనియన్ పెట్టుకోవడం, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం, వర్కర్స్ కాంపెన్సేషన్ వంటి అనేక చట్టాలు సాధించుకున్నామని తెలిపారు. అయితే కార్పొరేట్ కంపనీలు అంతులేని లాభాలు పోగేసుకోవటానికి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి ఎటువంటి రక్షణ లేకుండా చేసే నాలుగు 'లేబర్ కోడ్' లను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, రైతులు సంయుక్తంగా చేస్తున్న జాతీయ సమ్మెలో ఉపాధ్యాయులు కూడా సంఘీభావంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవహేళన చేస్తున్నాయని విమర్శించారు.

భీమవరం టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లావెన్స్ కుమారి పిలుపునిచ్చారు. ఈ మేరకు తుందుర్రు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్, గొల్లవానితిప్ప మెడికల్ ఆఫీసర్‌కు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి మాట్లాడుతూ స్వాత్రిక సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, విమల కుమారి, కళ్యాణి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం పథకాన్ని.. సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి




మొక్క నాటుతున్న కలెక్టర్ నాగరాణి, సర్పంచి వంశీకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధి హామీ చట్టంలో చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక అభివృద్ధికి రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం కుముదవల్లిలో కలిదిండి సూర్యనారాయణ రాజు వ్యవసాయ క్షేత్రంలో పంచాయతీ సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ కొబ్బరి మొక్కలు నాటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు ఆదాయ ఆర్జనతో పాటు, ఉపాధి కూలీలకు నిరంతరం పని కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 25 సెంట్ల నుంచి ఐదెకరాల భూమి కలిగిన ప్రతి ఒక్క రైతూ ఈ పథకానికి అర్హులన్నారు. మూడేళ్ల పాటు తోటల పెంపకాన్ని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు 1500 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 450 ఎకరాల్లో సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో ఉద్యానవన తోటల పెంపకానికి చర్యలు తీసుకున్నామన్నారు. మామిడి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్, ఆయిల్ ఫామ్, కోకో, గులాబీ, మల్లె, మునగ పంటల పెంపకానికి ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, ఎపిడి పి.సుజాత, గ్రామ సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణంరాజు, తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మి, ఎంపిడిఒ రెడ్డియ్య, హౌసింగ్ ఎఇ వెంకటేశ్వరరావు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లు దోహదం : ఎంఎల్ఎ



వీరవాసరం : మొక్క నాటుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

వీరవాసరం:మనిషి జీవిత కాలాన్ని పెంచడంలో చెట్లు ప్రముఖ పాత్ర వహిస్తాయని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎన్ఆర్ఇజిఎస్‌లో భాగంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం పంజావేమవరంలో ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆర్థిక అవసరాలు తీర్చుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుకోవాలన్నారు. ఎపి మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవానీ చంద్రశేఖర్ మాట్లాడుతూ చెట్లను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచి పంజా నాగబాబు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో లైన్‌మెన్ సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదన్నారు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ టిఎ.రవివర్మ మాట్లాడుతూ రైతులు మొక్కలు నాటుకుని నాలుగు సంవత్సరాల తరువాత వాటి ఫలసాయంతో ఆర్థికంగా లబ్ధిచేకూరాలన్నదే వనమహోత్సవం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, టిడిపి మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు పనిముట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం కాలంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 10 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంజినీరింగ్ కార్మికులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా జీతాలు పెంచాలన్నారు. బుధవారం జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల వెంకట్రావు, ఎబి.శ్రీనివాస్, కొడమంచిలి బాబు, తాడికొండ జయరాం కృష్ణ, ధనరాజు నాయకత్వం వహించారు.

ప్రజాప్రతినిధుల సహకారానికి ధన్యవాదాలు

అల్లూరి మెమోరియల్ హాల్ పునర్నిర్మాణ సాధన కమిటీ



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పిస్తున్న సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం


మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునర్నిర్మాణానికి సహకారం అందిస్తామన్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, పిఎసి ఛైర్మన్ స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులకు అల్లూరి మెమోరియల్ హాల్ పున:నిర్మాణ సాధన కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. భీమవరంలో అల్లూరి చిత్రపటానికి సాధన కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు జెఎన్‌వి.గోపాలన్, చెరుకువాడ రంగసాయి, బి.వాసుదేవరావు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణం చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు వివాహాలు, శుభకార్యాలు చేసుకోవాలన్నా లక్షల రూపాయలు ఖర్చవుతుందని, దీన్ని పేద, మధ్య తరగతి ప్రజలు భరించలేని పరిస్థితి అని, అల్లూరి మెమోరియల్ హాల్ నిర్మాణం వల్ల పేదల గుండెల్లో అల్లూరి చిరస్థాయిగా ఉంటారని తెలిపారు. వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి అల్లూరి సీతారామరాజు హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీను, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా రెడ్‌క్రాస్‌కు గుర్తింపు

వ్యవసాయ శాఖ జెడి, డిఆర్‌డిఎ పీడీ , రిటైర్డ్ డిఇఒ రమణకు అవార్డులు - నేడు విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం



జెడ్.వెంకటేశ్వరరావు



ఎంఎస్ఎస్.వేణుగోపాల్



రిటైర్డ్ డిఇఒ రమణ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రస్థాయిలో జిల్లా రెడ్‌క్రాస్‌కు మంచి గుర్తింపు లభించింది. జిల్లాకు చెందిన జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావుకు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఎంఎస్ఎస్.వేణుగోపాల్‌కు, రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణకు రాష్ట్రస్థాయిలో అవార్డులు లభించాయి. విజయవాడలో బుధవారం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఈ ముగ్గురు అధికారులు వారి శాఖల ద్వారా 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో రెడ్‌క్రాస్ కోసం తలసరి రూ.5 లక్షలకుపైగా నిధులు సమీకరించడం, సంస్థ కార్యకలాపాలకు అమూల్యమైన తోడ్పాటు అందించినందుకు ఈ అవార్డులకు ఎంపిక చేయడం జరిగింది. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షుడు టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ ఎంఎస్‌విఎస్.భద్రిరాజు, వైస్ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, ట్రెజరర్ కెబి.తిరుపతిరాజు, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు అవార్డులు అందుకుంటున్న అధికారులను అభినందించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాకు అవార్డులు రావడం ఎంతో గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన అధికారులు కూడా పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

ఎక్సైజ్ పాలసీని యథావిధిగా అమలు చేయాలి

14న మోకులతో తరలిరండి - కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఆచంట

కేరళ రాష్ట్రంలోని ఎక్సైజ్ పాలసీ మన రాష్ట్రంలో అమలు చేస్తే గీత కార్మిక కుటుంబాలకు భరోసా కలుగుతుందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆచంట - పోడూరు మండలాల గీత కార్మికుల సమావేశం బొంతు శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నా గీత కార్మికులకు న్యాయం చేయలేదన్నారు. పోరాడి ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్ మూసేశారని తెలిపారు. 2017లో ఎక్స్‌గ్రేషియో రద్దు చేశారన్నారు. చంద్రబాబు పాలనలో అక్రమ బెల్ట్ షాపులు, కల్తీ మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా ఉంటుందన్నారు. ప్రభుత్వ అండ లేకుండా జిల్లాలో 4 వేలు, రాష్ట్రంలో 70 వేలు బెల్ట్ షాపులు నడుస్తున్నాయా అని ప్రశ్నించారు. ఈ 14న కలెక్టర్ వద్దకు మోకులు ధరించి గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.చంటి మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వృత్తిని ఆధునికీకరించి, అభివృద్ధి చేయాల్సింది పోయి ఉన్న ఉపాధిని దారుణంగా దెబ్బతీసిందన్నారు. ఈ సమావేశంలో గుబ్బల రామస్వామి, జక్కంశెట్టి సత్యనారాయణ, ఆరేపల్లి వెంకటనారాయణ, బండి సత్యనారాయణ, కేతా నాగార్జున, బరిశెట్టి నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

14 వరకూ పశుగ్రాస వారోత్సవాలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పశుగణాభివృద్ధితో పాటు మేలు రకం పశు గ్రాసం సాగు ద్వారా అధిక పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్ధ్యం పెంపునకు ఈ నెల 14వ తేదీ వరకూ నిర్వహించే పశుగ్రాస వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశు గ్రాసం సాగు, పాడి రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలను పశువైద్య శాలలు లేక రైతుసేవ కేంద్రాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో బహువార్షిక పశుగ్రాసాలను సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. సొంత భూమి కలిగిన ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు 10 నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో మేలు జాతి పశుగ్రాసాల సాగుకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిగూడెం వెంకట రామన్నగూడెంలో జిల్లా గేదెల పరిశోధనా కేంద్రంలో మేలుజాతి పశుగ్రాసాల ప్రదర్శన, పాడిరైతులకు అవగాహనా సదస్సులో కలెక్టర్ నాగరాణి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరుకానున్నారని పశు వైద్య శాఖ అధికారులు తెలిపారు.



తహశీల్దార్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న డిటి మహేష్

సిఎస్ డిటిగా మహేష్ బాధ్యతలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల పౌర సరఫరాల ఉప తహశీల్దార్‌గా మోరంపూడి మహేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను కార్యాలయ సిబ్బంది అభినందించారు. మహేశ్ గతంలో ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పౌర సరఫరాల పంపిణీ వ్యవస్థను అందరి సహకారంతో సమర్థమంతంగా నిర్వహిస్తానన్నారు.

తణుకు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా సాయికిరణ్

భీమవరం :తణుకు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా కె.సాయికిరణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తణుకు జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి మరింత కృషి చేయాలని తెలిపారు.

కాళీపట్నం తూర్పులో కేంద్ర బృందం పర్యటన


మొగల్తూరు:మండలంలోని కాళీపట్నం తూర్పులో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ టీం సభ్యులు పర్యటించారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సాలిడ్ హెల్త్ ప్రాసెసింగ్ కేంద్రాలు, పబ్లిక్ టాయిలెట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. టీం సభ్యులు ఎన్.సునీల్, రాజేష్, డిపిఆర్‌సి టీమ్ కె.విశ్వనాథం ఎన్ ఎడ్వర్డ్, ఎస్‌బిఎం టీమ్ ఎన్.దినేష్, కె.రామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.నవీన్ కిరణ్, డిఎల్‌పి జ్యోతిర్మయి ఉన్నారు.

ఉపాధి చట్టంలో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

పలు గ్రామాల్లో మాసివ్ ప్లాంటేషన్



కాళ్ల : బొండాడపేటలో మొక్కు నాటుతున్న ప్రముఖులు



తాడేపల్లిగూడెం : మొక్కు నాటుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో మాసివ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం అభినందనీయమని జి.స్వాతి పేర్కొన్నారు. మండలంలోని బొండాడ పేట, ఏలూరుపాడు, కోమటిగుంట గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మాసివ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొండాడ పేట, కోమటిగుంట, ఏలూరుపాడు గ్రామ సర్పంచ్ లు.ముదునూరి శ్యామల, బోణం భాగ్యశ్రీ శివకుమార్, భూపతి రాజు వెంకట జగ్గారావు, ఎంపిటిసి సభ్యులు గుత్తికొండ సత్యనారాయణ, చిన్నాపరపు రాంబాబు, గ్రామ కార్యదర్శులు కె.వీర మణికంఠ, ఎస్.అరుణ దేవి, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లు ఎం.నాగలక్ష్మి, కమతం లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉణుకు : రైతులు శ్రేయస్సు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందజేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఒకరోజు ఉద్యమ స్ఫూర్తిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం అత్తిలి మండలం పాలి గ్రామంలో ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు ప్రయోజనకరంగా ఉంటూ, వారికి ఆదాయాన్ని చేకూర్చే విధంగా పండ్ల మొక్కలు నాటేందుకు వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి ఎంపిపి వైర్మన్ దాసం ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అత్యంత వేగవంతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగులు తీసుకున్నాయని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. వన మహోత్సవం-2025 సందర్భంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా పెంటపాడు మండలం, కోరుమిల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ ఛైర్మన్ వలవల బాబ్జి, కోరుమిల్లి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల ప్రకృతి బాగుంటుందని, మొక్కల్లో మానవుల మనుగడకు మెట్లని భట్లమగుటూరు గ్రామ జనసేన అధ్యక్షులు బయ్యె బాలాజీ అన్నారు. మంగళవారం ఉదయం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. టిడిపి గ్రామ అధ్యక్షులు జంగం చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి గంట శ్రీను, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుబ్బలక్ష్మి, పాలమూరి రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మూర్తి గ్రామస్తులు, శ్రామికులు పాల్గొన్నారు.

ఉండి: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ను అందించాలని ఎన్ఆర్ అగ్రహారం గ్రామ సర్పంచి సూరపరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. బుధవారం ఉండి మండలం వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఆర్పి అగ్రహారంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఎన్ఆర్పి అగ్రహారం ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, నాయకులు కన్నెగంటి రూత్ కర్, గురువుపల్లి వెంకట సత్యనారాయణ, కర్రి శ్రీనివాస్, వెలివర్రు ఉప సర్పంచి ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నరసాపురం : పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని డిఎల్డిఒ జి.గాంధీ అన్నారు. రుస్తుంబాదలో గ్రామ సర్పంచ్ బందెల భారతి రవీంద్ర, గ్రామస్తులతో కలిసి ఆమె రైతుల భూముల్లో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జిఎస్.రామకృష్ణంరాజు, ఉప ఎంపిడిఒ కె.నాగేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి గుబ్బల నాగరాజు, పాలా రాంబాబు, గ్రామ కార్యదర్శి ముచ్చు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

థియేటర్లో అసౌకర్యానికి నష్టపరిహారం


మొగల్తూరు : మొగల్తూరులోని థియేటర్లో వినియోగదారునికి అసౌకర్యం కలిగించినందుకు నష్టపరిహారం విధించినది కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తణుకుల రామకృష్ణ అన్నారు. మంగళవారం మొగల్తూరులో విలేకరులకు వివరాలు తెలిపారు. స్థానిక శ్రీదేవి జానకి(దొరకూరి) థియేటర్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టిక్కెట్లు అధికరేట్లకు విక్రయించడం, థియేటర్లో కూల్డ్రింక్స్, పాప్కార్న్ తదితర తినుబండారాలు అధిక రేట్లకు అమ్మడం, ధరల పట్టిక లేకపోవడం తదితర వాటిపై కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించామన్నారు. కన్స్యూమర్ కోర్టు అధిక ధరలకు టిక్కెట్లు అమ్మినందుకు పదివేలు జరిమానా, ప్రేక్షకులకు అసౌకర్యం కలిగించినందుకు పదివేలు వినియోగదారునికి చెల్లించాలని కన్స్యూమర్ ఫోరం ఆదేశించిందని ఆయన తెలిపారు. భవిష్యత్లో థియేటర్లో యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రామకృష్ణ ఆరోపించారు.

ఎలిజి చర్లలో పొలం పిలుస్తోంది

నరసాపురం: మండలంలోని ఎలిబిచర్ల, చామకూరిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి అడబాల జ్యోతి వరిలో సాగుబడి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని తద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే పథకాలకు అర్హులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో వివిఎ.సాయిదుర్గ, కటకంశెట్టి సంజీవరావు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

యువత విద్యకు ప్రాధాన్యతివ్వాలి

అంబేద్కర్, జగ్జీవన్రామ్ విగ్రహావిష్కరణలో ఎంఎల్ఎ ఆరిమిల్లి



విగ్రహాలావిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

సమాజంలో యువత విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాబోయే పది తరాలపై ప్రభావం ఉంటుందని, ఇందుకు మహనీయులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్రామ్ నిదర్శనమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన బూరగ చర్ల, జిఎం చర్ల యూత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. గ్రామంలో మొట్టమొదటిసారిగా అంబేద్కర్, జగ్జీవన్రామ్ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. వారి జీవిత చరిత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఉన్నత స్థానంలోకి ఎదగడంతోపాటు పదిమందిని ప్రభావితం చేసేందుకు కుటుంబ ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా స్వశక్తితో ఉన్నత చదువులు చదువుకుంటూ దేశంలో ఎంతోమంది జీవితాలను ప్రభావితం చేసిన అంబేద్కర్, జగ్జీవన్రామ్ మార్గదర్శకులని అన్నారు. కార్యక్రమంలో అత్తిలి, తణుకు ఎంపిపి ఛైర్మన్లు దాసం ప్రసాద్, కొండేటి శివ, ఎంపిపి మక్కా సూర్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా పంట బీమా నమోదు

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కాళ్ల

రైతులకు పంటల బీమా పథకం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, ఎకరానికి రైతు రూ.210 చెల్లిస్తే సరిపోతుందని, మండల పరిధిలోని రైతులు ఆగస్టు 15వ తేదీలోగా పంట బీమాను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ నాయుడు కోరారు. కాళ్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. కాళ్ల ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపిడిఒ జి.స్వాతి, జెడ్పిటిసి సభ్యుడు పి.సోమేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా మండలాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందించే సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో లేవనెత్తి అధికారులను నిలదీశారు. కాళ్ల గ్రామంలో మంచినీరు, డ్రెయినేజీ నీరు పంట కాలువలోకి వదిలేస్తున్నారని ఎంపిటిసి సభ్యులు నాగరత్నం మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశంలో ప్రజాప్రతినిధులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో పలు గ్రామాల ఎంపిటిసిలు చిన్నాపరపు రాంబాబు, నాగరత్నం, పలు గ్రామాల సర్పంచులు కొనకంచి సూర్యనారాయణమూర్తి, జి.మధు, విద్యుత్శాఖ ఎఇ పి.రాంబాబు, వైద్యశాఖ అధికారిణి డి.సునీత, పంచాయతీరాజ్ ఎఇ రమేష్బాబు, మత్స్యశాఖ అధికారిణి ఇందిరా ప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నూరు శాతం అడ్మిషన్లు జరగాలి : కలెక్టర్

భీమవరం : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నూరు శాతం అడ్మిషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో తల్లికి వందనం కార్యక్రమంపై కలెక్టర్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, రెసిడెన్షియల్ పాఠశాలలు, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈనెల 10వ తేదీన రెండో విడత తల్లికి వందనం సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నారని తెలిపారు. జిల్లాలో అన్ని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నూరు శాతం అడ్మిషన్లు జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బివిఎస్ఎస్ రామాంజనేయరాజు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి జి.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మొదటి విడతగా రహదారుల అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి తెలిపారు. ఇటీవల పవన్ కళ్యాణ్ పిఎ కృష్ణతేజ బృందం మొగల్తూరులో ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తున్నారని ఎంపిడిఒ తెలిపారు.



కాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్సి వైద్యులు, ఆశాలు

'క్షయ నిర్మూలన అత్యవసరం'

కాళ్ళ : క్షయ వ్యాధి నిర్మూలన అత్యవసరమని వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ వి.రంగారావు నాయుడు, డాక్టర్ సరాబు సునీల్ పేర్కొన్నారు. మంగళవారం కాళ్ల పిహెచ్సిలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఇంటెన్సిఫైడ్ టిబి ఎంటివ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశ్యం వివరించారు. 65 సంవత్సరాల పైబడి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, షుగర్ పేషెంట్లు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారు, స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటు ఉన్నవారు వీరంతా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాల్సిందిగా కోరారు. ఎవరైనా దాతలు నిక్షేమిత్రగా రిజిస్ట్రేషన్ చేయించుకుని టిబి పేషెంట్లకు నెలకు రూ.600 చొప్పున ఆరు నెలలకు పేషంట్లకి పౌష్టికాహార నిమిత్తం ఇవ్వవలసిందిగా కోరారు. కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్సి వద్ద డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిబిముక్తి భారత్ అభియాన్లో రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరావు సహకారంతో 20 మంది టిబి వ్యాధిగ్రస్తులకు నిక్షయమిత్ర పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, రాపాక రత్నంరాజు, డిపిసి ఆర్.విద్యానంద్ పాల్గొన్నారు.

ఉండి: ఉండి పిహెచ్సి పరిధిలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో డాక్టర్ సునంద ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం వై.రామలక్ష్మి అధ్యక్షతన స్కూలు పిల్లలకు క్షయ వ్యాధి నిర్ధారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయవలసిన వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్సి వైద్యులు సిహెచ్.కృష్ణకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరులో డెంగీ మాసోత్సవాలు

పాలకోడేరు : పాలకోడేరు పిహెచ్సి పరిధిలో డాక్టర్ ఎం.గుణాద్ రాజకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగీ మాసోత్సవాల సందర్భంగా పిహెచ్సి నుండి రావిపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సిహెచ్ఓ సత్యనారాయణ, పిహెచ్ఎన్.కుమారి పాల్గొన్నారు.

ట్రాఫిక్కు అంతరాయం

నరసాపురం: నరసాపురం-పాలకొల్లు 216 జాతీయ రహదారిలోని హీరో హోండా షోరూం వద్ద మంగళవారం సాయంత్రం కొబ్బరికాయాల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ నుంచి కాయాలు రోడ్డుపై దొర్లడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయ ఏర్పడింది. వ్యాన్, ట్రాక్టర్ ఎదురెదురుగా వస్తున్న సమయంలో కొబ్బరికాయలు లోడు తో ఉన్న ట్రాక్టర్ కు వ్యాన్ తగలడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. దీంతో కాయాలన్ని రోడ్డుపై దొర్లాయి. సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరకు పోలీసులు వచ్చి ట్రాఫిక్ను నియంత్రించారు. వాహనదారులతో సాయంత్రం రోడ్డుపై ఉన్న కొబ్బరికాయాలను ఏరి ట్రాక్టర్లో వేయడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

ఘనంగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి



పాలకొల్లు : ప్రభుత్వాసుపత్రిలో పళ్లు అందజేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంఎల్సి కవురు శ్రీనివాస్, మండల అధ్యక్షులు చెల్లబోయిన సాహారావు, గొల్లలకోడేరులో వేకూరి నరేంద్రరాజు, మొగల్లులో దొడ్డా విస్సు, జాలె సునీల్ ఆధ్వర్యంలో, విస్సాకోడేరు, తదితర గ్రామాల్లో వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ అర్పించారు.

పెనుమంట్ర : మండలకేంద్రం పెనుమంట్రలో వైసిపి మండల అధ్యక్షులు తేతలి సుధీర్ రెడ్డి ఆధ్వర్యాన గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపిటిసి చింతపల్లి మంగాదేవి, గురువు సర్పంచి నాగరాజు, కొవ్వూరి మోహనరెడ్డి, చిలంకిలి రెడ్డి, వారిపసాద్ రెడ్డి, సాయి నారాయణ రెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, తేతలి బాపిరెడ్డి, దొంగ నరసింహమూర్తి, తదితరులు వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మార్టేరు సెంటర్లో గ్రామ ఉప సర్పంచి కర్రి వేణుబాబు, పార్టీ టౌన్ అధ్యక్షులు కొవ్వూరు బ్రహ్మేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

గణపవరం : పిహెచ్సిలో ఉన్న రోగులకు పాలు, పళ్ళు అందజేశారు. మండల అధ్యక్షులు దండు రాము మాట్లాడారు. అనంతరం స్థానిక మార్కెట్లో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైసిపి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బర్రె నారాయణమూర్తి, కుక్కల కృష్ణమోహన్, పడవల సత్యనారాయణ, కె.ముక్తేశ్వరరావు ఉన్నారు.

ఆచంట : రామేశ్వర స్వామి ఆలయ ఆవరణ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి యువ నాయకులు చెరుకువాడ వెంకట నరసింహ రాజు(నరేష్) పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆచంట పరిశీలకులు ఇందుకూరి వాసు, పోడూరు జెడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు, పెనుమంట్ర జెడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిని, వైట్ల కిషోర్ కుమార్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉండి: గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున ఆధ్వర్యాన బాలాజీరావుపేటలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, సీనియర్ నాయకులు గులిపల్లి అచ్చారావు, రణస్తుల మహంకాళి, బదుగు బాలాజీ, గలవల్లి ధనుంజయ, రణస్తుల రామచంద్రరావు, గుడ్డ భోగేశ్వర రావు, రాయి సతీష్ పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి జిల్లా పరిషత్ సభ్యులు వెంకటరాజు(ఎంఆర్డి శీను) నాయకత్వంలో నివాళి అర్పించారు. పేదలకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పళ్లు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటుపల్లి గంగాధరరావు, సందాల సీతారామయ్య, అంబటి రమేష్, పుప్పాల సత్యనారాయణ(పండు) పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు కొలుకూరి ధర్మరాజు, ఎంపిపి మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు. గుండుపాలెంలో నాగు దంపతులు పేదలకు చీరలు పంపిణీ చేశారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని యార్లగడ్డ గురువు వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రి జయసరిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్ద తాతాజీతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ గుడాల గోపి ఆధ్వర్యాన వైఎస్ఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడాల గోపి సతీమణి గుడాల మంగతాయారు, ముదునూరి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని వైసిపి కార్యాలయంలో గురుగుబిల్లి మహేశ్వరరావు కార్యాలయంలో గుబిలి ఉమా, పేదీ రాజు, పెండ్ర వీరన్నలు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రుస్తుంబాదలో పిల్లి నవరత్నం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇటు పార్టీ కార్యాలయంలో చిగురుపాటి సందీప్, దినమిల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి వెంకటరమణ, కమాన బుజ్జి, పప్పుల రామారావు, అందాజు చల్లారావు పాల్గొన్నారు.

డేటా పోర్టల్కు గడువు పెంపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ఉన్నటువంటి సొంత భూమి కలిగిన భూ యజమానులకు డేటా పోర్టల్ నమోదు ప్రక్రియ కోసం ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచినట్లు మండల వ్యవసాయ శాఖ ఇన్ఛార్జి అధికారిణి బి.దేవి స్వరూప మంగళవారం ఇక్కడ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం, అన్నదాత సుఖీభవ పథకంలో ఎవరైనా ఇంకా అర్హత కలిగి డేటా పోర్టల్లో నమోదు చేసుకోవలసి వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ అవకాశం ఈనెల 12వ తేదీ వరకు ఉందని, కావున సొంత భూమి కలిగి ఉండి అర్హత కలిగి ఉన్నట్లుయితే ప్రతి ఒక్కరూ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ మాడ్యూల్లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నమోదు కార్యక్రమం కోసం ప్రతి రైతు సేవా కేంద్రంలో ఉన్నటువంటి గ్రామ వ్యవసాయ సహాయకుల్ని సంప్రదించి, మీ అభ్యర్థనను తెలియజేయాలని, ఈ విషయంలో ప్రతిలందరూ లబ్ధి పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.దేవి స్వరూప కోరారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - గణపవరం

తాము చదుకున్న పాఠశాలకు కావలసిన వస్తువులు అందజేసి, పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్న పూర్వవిద్యార్థులను అభినందించారు జల్లికొమ్మ మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కటకం సుందర కుమార్ అభినందించారు. మంగళవారం పాఠశాలలో 2015-16లో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.14 వేల విలువ కలిగిన బీరువాను కవల రాజేష్, కుర్ర లోకేష్, మద్దాల సంజీవరావు, అడ్డగర్ల వెంకన్నబాబులు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. పాఠశాలకి బీరువాను అందజేసినందుకు హెచ్ఎం సుందరకుమార్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

స్టీమర్ రోడ్లో ఉన్న అన్న క్యాంటీన్ను నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించి అన్న క్యాంటీన్లో అల్పాహారం, భోజనం చేస్తున్న వారితో ముఖాముఖిగా మాట్లాడారు. అన్నక్యాంటీన్కు ప్రజలకు మౌలిక అవసరాలను తీర్చే కేంద్రాలుగా మారాయని, అందువల్ల నిత్యం ఈ క్యాంటీన్ను పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. క్యాంటీన్లో శుభ్రతను కచ్చితంగా పాటించడంతో పాటు రోజూ సమయానికి నాణ్యమైన భోజనం అందించాల్సిన బాధ్యత అక్షయపాత్ర సిబ్బందిపై ఉన్నారు. క్యాంటీన్లో తాగునీరు శుభ్రంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్యాంటీన్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా ఆహార సంబంధిత సమాచారం పొందేలా చేసుకోవచ్చని తెలిపారు. అన్నక్యాంటీన్ సేవలను మరింత ప్రభావవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు 60 మంది హాజరు

నరసాపురం : గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కోసం లక్ష్మణేశ్వరం, నక్కావారిపేటలోని బిసి గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షల్లో 63 విద్యార్థులు పాల్గొనాల్సి ఉండగా 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ కైశవులు తెలిపారు.

పలుచోట్ల సేఫ్ క్యాంపస్ జోన్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం వన్ టౌన్లో సిఐ నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ నిర్వహించారు. ఇందులో భాగంగా స్కూల్స్, కాలేజీల వద్ద ఉన్న పాన్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి పాన్ షాపుల నుంచి టుబాకో ప్రొడక్ట్స్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో బడుగుల పాన్ షాపు ఓనర్లపై కేసు నమోదు చేశారు.

గణపవరం : మండల కేంద్రమైన గణపవరంలో ఉన్న పాన్ షాపులలో మత్తు పదార్థాలు అయినటువంటి గుట్కా, ఖైని, గంజాయి వంటివి అమ్మకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఆకుటిఎం.రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం గ్రామంలో ఉన్న పలు పాన్ షాపులను తనిఖీ చేశారు. గణపవరం, నిడమర్రు పోలీసులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : విద్యార్థులు చెడు వైపు మరలకుండా మంచివైపు నడిపించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమాన్ని చేపట్టిందని తాడేపల్లిగూడెం పట్టణ సిఐ బోసం ఆది ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పాన్ షాపు, కిరణ షాపుల్లో హానికర గుట్కా, ఖైనీ పాకెట్ల విక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ ఆది ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలకు 100 మీటర్ల లోపు గుట్కా, ఖైనీ పాకెట్ విక్రయాలు జరపరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం అధ్యక్షునిగా నాగూర్ సాహెబ్

తాడేపల్లిగూడెం : రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా షేక్ నాగూర్ సాహెబ్ ఎన్నికయ్యారు. స్థానిక వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.శరత్ బాబు, కూచి వెంకట నాగేశ్వరరావు(సాయి చిర్ర), ప్రధాన కార్యదర్శిగా చింతలపాటి వంశీకృష్ణ, కోశాధికారిగా ఏలూరి జగదీశ్, కార్యదర్శులుగా జెకె.కృష్ణ, మిరియాల రవిబాబు, మహిళా అధ్యక్షురాలు కప్పల శారద ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కొల్లి రమావతి, సీర కొండలరావు, షేక్ ఖాసిం సాహెబ్ వ్యవహరించారు. తాళ్లూర ప్రధానోపాధ్యాయుడు, కవి బండారు జ్ఞాన ప్రసాద్ సంఘ శాశ్వత నిధికి రూ.5000 నగదు అందజేశారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

తాడేపల్లిగూడెం : పిఎం మోడీ రాష్ట్రానికి చేస్తున్న ఆర్థిక సహాయాన్ని ప్రజల దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తాడేపల్లిగూడెం రూరల్ మండలం, దండగర్ర గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు జలజీవన్ మిషన్ పథకం కింద రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 60 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకును బిజెపి ఇన్ఛార్జి ఈతకోట తాతాజీతో కలిసి ప్రారంభించారు. దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ ప్రసాదరావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ఉండి : మండలంలోని ఉండి, ఎన్ఆర్పి అగ్రహారం, వాండ్రం, వెలివర్రు గ్రామాలలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, క్లస్టర్ ఇన్ఛార్జి గుడుగుబిల్లి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు దాసిరి వెంకటకృష్ణ మాట్లాడారు. ఎన్ఆర్పి అగ్రహారం గ్రామ అధ్యక్షులు కన్నెగంటి రూతేశ్, వెలివర్రు పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్రాజు, ఉండి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం: రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు ఎంఎ షరీఫ్, మత్స్యకార సహకార సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఇన్ఛార్జ్ రామారావుల సెంటర్ పట్టణంలోని 24వ వార్డులో సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శిరిగిరి రాజ్యలక్ష్మి, పొన్నాల నాగబాబు, పాలూరి బాబ్జి, సంకు బాస్కర్ పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లాలో పత్సమట్ల అనే కార్యక్రమంలో భాగంగా కొమ్మర, డి.కుమదపల్లి, మొయ్యేరు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆకాంక్షల బాటలో కూటమి ప్రభుత్వం సాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత అందిస్తూ సుపరిపాలన అందించడం జరుగుతుందని చెప్పారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.దొరబాబు, మరోషిమెగోన్, సిబ్బంది కలిసి మంగళవారం మండలంలోని నవాబ్ పాలెం గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నవాబ్పాలెం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.